**కథ** — వాణిశ్రీ

# ఐతే ఏంటి?

**"ఐతే ఏంటి?" అన్నాడు అర్జున్.**

**అంతా ఆశ్చర్యపోయారు.**

**అది క్రికెటర్ల డ్రెస్సింగ్ రూమ్. లండన్‌లోని లార్డ్స్ స్టేడియంలో ఇంగ్లాండ్ జట్టుమీద వన్‌డే మ్యాచ్ గెలిచి, జట్టులోని క్రికెటర్లంతా హుషారుగా ఉన్నారు.**

అప్పుడు అర్జున్ సెల్ మ్రోగింది.

''కెన్ ఐ స్పీక్ టూ మిస్టర్ అర్జున్. ఐ యామ్ ఊర్వశి, ఫిలిం స్టార్''

''అర్జున్! ఫిలిం స్టార్ కాల్ చేసింది'' శ్రీరామ్ సెల్ అందించాడు అర్జున్‌కి.

''ఏ ఫిలిం స్టార్?''

''ఊర్వశి. ఈ రాత్రి నిన్ను స్వర్గానికి లాక్కెళ్తుందేమో''

''ఐతే ఏంటి?'' అని సెల్ ఆఫ్ చేశాడు.

శ్రీరామ్ ఆశ్చర్యపోయాడు.

''అరె అర్జున్. ఊర్వశి లాంటి అందగత్తె పాపులర్ ఫిలింస్టార్ ఫోన్ చేస్తే ఐతే ఏంటి? అని సింపుల్‌గా అంటున్నావే! అంతేలే వనిత తావలచి వచ్చిన లోకువ అని కవి అన్నది నిజమే'' అన్నాడు శ్రీరామ్.

''ఊర్వశి పెద్ద ఫిలింస్టార్ ఐతే నాకేంటి గొప్ప? ఆవిడ ప్లాన్ నాకు అర్థమైందిలే. తనేదో పెద్ద అందగత్తె అనీ, తనంటే మనం కుక్కపిల్లల్లా వెంటబడతామనీ అనకుంటున్నది. నన్ను ముగ్గులోకి దించి పెళ్లిచేసుకోవాలని ఐడియా! నేనెక్కడకి వెళ్లినా ఫోన్లో పలకరిస్తుంది. మనం మనం తెలుగువాళ్లం అంటుంది. తెలుగువాడు ఇండియా జట్టులో సెలెక్ట్ కావడం గ్రేట్ అంటుంది. ఆ మాయలో పడేంత వెర్రివాడిని కాదు'' అన్నాడు అర్జున్.

''ఎందుకలా అనుకుంటావు? ఆమె నిన్ను నిజంగానే లవ్ చేస్తున్నదేమో? తనంతట తాను చనువు తీసుకుంటున్నదని చీప్‌గా మాట్లాడకు. మనం గెలిచినందుకు కంగ్రాట్స్ చెప్పాలని ఫోన్ చేసిందేమో? నీ మనసులో ఏమున్నా మాట్లాడి ఉండాల్సింది. కాల్ చేసినందుకు థాంక్స్ చెప్తే నీ సొమ్మేం పోయింది'' అన్నాడు శ్రీరామ్.

''నీకు తెలీదులే! తామేదో వి.ఐ.పి.లనుకునే వాళ్లకి షాక్ ఇవ్వాలి. వెంటపడితే చీప్ అయిపోతాం'' అని నవ్వాడు అర్జున్.

శ్రీరామ్‌కి అర్జున్ వరసేం నచ్చలేదు. తనెంత క్రికెటర్ అయినా అంత గర్వం పనికి రాదనిపించింది.

''ఒకవేళ ఊర్వశికి నిన్ను పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం ఉంటే తప్పేంటి?'' అడిగాడు శ్రీరామ్.

''ఊర్వశిని పెళ్లి చేసుకునే ఖర్మ నాకేం పట్టింది? తనకి ముప్పై ఏళ్లు దాటి ఉంటాయి. బాయ్‌ఫ్రెండ్స్ ముగ్గురితో ఎఫైర్స్ సాగించింది''

''అవన్నీ గ్యాసిప్ కావొచ్చుగా! పబ్లిక్‌లో ఉండే వాళ్ల మీద మీడియాలో ఇటువంటివి రావడం సహజం. అవన్నీ నిజమనుకుంటే ఎలా?''

''నేను పెళ్లిచేసుకోదల్చుకుంటే ఇండస్ట్రియలిస్టుల కూతుళ్లు క్యూలో నిల్చుంటారు'' గర్వంగా అన్నాడు అర్జున్.

శ్రీరామ్ మాట్లాడలేదు.

అర్జున్ క్రికెటర్ కాకముందు సాదాసీదాగానే ఉండేవాడు. రైల్వేలో చిన్న జాబ్ చేసేవాడు. దేశవాళీ క్రికెట్లో ఆడేవాడు. అదృష్టం బాగుండి జాతీయ జట్టులో సెలక్టయ్యాడు. ఇక అంతే. తను ప్రపంచంలో ఒక వి.ఐ.పి. అయిపోయినట్లు ఫీలవుతున్నాడు.

డబ్బుతో పాటు గర్వం పెరిగింది. తనంటే అమ్మాయిలు పడిచచ్చిపోతారనే భావంతో ఉంటాడు. క్రికెటర్ కాబట్టి కొందరు అమ్మాయిలు క్రేజ్‌తో ఉండొచ్చు. అందరూ అలా ఉంటారా?

★ ★ ★

మెహిదీపట్నంలో సూర్య అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుక్కుని ఉంటున్నాడు శంకరయ్య. అతను సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసర్. సూర్య అపార్ట్‌మెంట్ ఇప్పుడు ఆ ప్రాంతంలో బాగా పాపులరైంది. క్రికెటర్ అర్జున్ ఉండేది అందులోనే. శంకరయ్య కొడుకే అర్జున్.

''క్రికెటర్ అర్జున్ ఉండేది మా ఫ్లాట్స్‌లోనే'' అని పిల్లలు గర్వంగా చెప్పుకోసాగారు ఫ్రెండ్స్‌తో.

''అర్జున్ మన యస్.ఓ. శంకరయ్య కొడుకే'' అని సెక్రటేరియట్‌లో సెక్రటరీలు సైతం తోటి కొలీగ్స్‌తో అనడం మొదలుపెట్టారు.

ఒకరోజు ఆదివారం శంకరయ్య వాకింగ్‌కి వెళ్లి తిరిగి వచ్చేసరికి ''కూకట్‌పల్లి నుంచి ఆదినారాయణట. రియల్ ఎస్టేట్ బిజినెస్సట. మన కేస్టేనట. వాళ్లమ్మాయి బి.టెక్ పాసైందట. ఫోన్ చేశారు'' అన్నాడు భార్య.

''ఐతే ఏంటట?'' వ్యంగ్యంగా అన్నాడు శంకరయ్య.

''అర్జున్‌కి పెళ్లి చేస్తారా? అని అడిగాడు'' అన్నది.

''బోడి రియల్ ఎస్టేట్ వాడేమిటి? పెద్ద పెద్ద ఇండస్ట్రియలిస్టులు అడుగుతున్నారు. ఎవరైనా ఫోన్ చేస్తే మా వాడికి ఇప్పుడు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం లేదని చెప్పు. ముందు మనం ఈ ఏరియా నుంచి షిఫ్టకావాలి. ఫ్లాట్‌కి బేరం పెట్టాను'' అన్నాడు శంకరయ్య.

''అయ్యో రామా. పదేళ్లుగా ఇందులో ఉంటున్నాం. బాగా అలవాటైపోయింది. ఇప్పుడు షిఫ్ట్ చేయాల్సిన అవసరం ఏముంది?'' అన్నది ఆశ్చర్యపోతూ.

''ఓసి పిచ్చిదానా! నీకేం తెలియదు ఊరుకో. వి.ఐ.పి.లు ఉండేది జూబ్లీ హిల్స్‌లో. ఇప్పుడు మనం కూడా వి.ఐ.పి.లమే. అక్కడ ఉంటేనే విలువ. జూబ్లీ హిల్స్‌లో ఫ్లాట్ మాట్లాడుతున్నాను. షిఫ్ట్ అయ్యాకే వాడి పెళ్లి'' అన్నాడు శంకరయ్య.

ఆర్నెల్ల తర్వాత శంకరయ్య కుటుంబం జూబ్లీ హిల్స్‌కి మారిపోయారు.

మంచి సంబంధం కోసం చూడసాగాడు శంకరయ్య. 'మంచి అంటే' అతని దృష్టిలో 'బాగా డబ్బున్న' అని అర్థం.

కోటీశ్వరుల సంబంధాలలో చాలావరకు అర్జున్‌కి నచ్చలేదు. ఆఖరుకి ఇండస్ట్రియలిస్ట్ రామయ్య మనుమరాలు అపర్ణ ఫోటో చూసి 'బాగుంది' అని సర్టిఫికెట్ ఇచ్చాడు అర్జున్.

★ ★ ★

శంకరయ్య, రామయ్యకి ఫోన్ చేశాడు. 'అర్జున్‌కి మీ మనుమరాలు నచ్చింది. అమ్మాయిని చూడడానికి రావాలనుకుంటున్నాం. ఎప్పుడు రమ్మంటారు?' అని.

రామయ్య ఇంట్లో వాళ్లతో మాట్లాడి ఫోన్ చేస్తానన్నాడు.

ఇంటికి వెళ్లిన తర్వాత భార్యకి చెప్పాడు.

''అర్జున్‌కి మన అపర్ణ నచ్చిందట. అమ్మాయిని చూడ్డానికి వస్తున్నారు. ఎప్పుడు రమ్మందాం?''

''అసలు మనం పెళ్లి సంబంధాలు చూస్తున్నట్టు అపర్ణకి తెలియనే తెలీదు. ముందు దానికి

చెప్పాలి'' అన్నది.

''దానికేముందు చెప్పు'' అన్నాడు రామయ్య.

అపర్ణ ఇంటికి రాగానే పెళ్లి సంగతి ఎత్తింది ఆమె తల్లి. నాయనమ్మ, తాతయ్య మంచి సంబంధం చూశారని చెప్పింది.

''నేనిప్పుడు పెళ్లి చేసుకోనమ్మా!'' అన్నది అపర్ణ.

''విషయం తెలుసుకోకుండా మాట్లాడకు. నిన్ను ఇష్టపడుతున్నవాడు క్రికెటర్ అర్జున్. అతన్ని పెళ్లి చేసుకోవాలని చాలా మంది అమ్మాయిలు ఉవ్విళ్లూరుతున్నారు తెలుసా?'' అన్నది తల్లి.

''ఏంటమ్మా క్రికెటర్ అయితే అంత గొప్ప?'' అడిగింది అపర్ణ.

తల్లి విస్తుపోయింది.

''అదేంటే అంతా అతనంటే పడిచస్తుంటే'' అన్నది.

''అదంతా క్రేజ్. తాత్కాలికం. ఇప్పుడు జట్టులో ఆడుతున్నాడు కాబట్టి విలువ. సంవత్సరం తర్వాతో ముందో అతను సరిగ్గా ఆడకపోతే పనికిరావని పీకిపారేస్తారు. అప్పుడేం చేస్తాడు? గోళ్లు గిల్లుకుంటూ ఇంట్లో కూర్చుంటాడు. పాత కథలు జ్ఞాపకం చేసుకుంటూ కుమిలిపోతుంటాడు. తనకు తగిన గుర్తింపు లేదని వాపోతుంటాడు'' అపర్ణ చెప్తోంటే తల్లి ఆశ్చర్యంగా చూసింది.

''అదేంటే! అట్లా తీసి పారేస్తావు?'' అన్నది.

''తీసిపారెయ్యటం కాదమ్మా! వాస్తవం చెప్తున్నాను''

''అదికాదే! నీకు వయసొచ్చింది. ఎవరో ఒకర్ని పెళ్లి చేసుకోవాలి గదా? అతను ఇతనే ఐతే ఏంటి?''

''అతనితో నా జీవితం సాఫీగా ఉండదమ్మా! ఎప్పుడూ ప్రాక్టీసనీ.. విదేశీ టూర్లనీ తిరుగుతుంటాడు. పెళ్లాన్ని పట్టించుకునే తీరికేది? నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని. నాకు తోడుగా నా పరిశోధనల్లో భాగం పంచుకునే వాడిని పెళ్లి చేసుకుంటాను. నేను ఏదైనా సరికొత్త సాఫ్ట్‌వేర్ కనిపెట్టాలని చూస్తున్నాను. ఇప్పట్లో పెళ్లి మాట ఎత్తకు'' చెప్పింది అపర్ణ.

''అదేంటే! మీ నాన్న లేడు కాబట్టి నేను, తాతయ్య పట్టించుకోవాల్సి వచ్చింది''


''నాన్న ఉంటే నన్ను అర్థం చేసుకునేవాడమ్మా!'' అన్నది అపర్ణ.

తల్లి మౌనం వహించింది

★ ★ ★

శంకరయ్య వారం తర్వాత ఇండస్ట్రియలిస్ట్ రామయ్యకి ఫోన్ చేశాడు.

''రామయ్యగారూ! నేను శంకరయ్యని మాట్లాడుతున్నాను. నమస్కారం''



''నమస్కారం సారీ! బిజీ వల్ల మాట్లాడలేకపోయాను''

''ఫర్వాలేదు సార్! అమ్మాయిని చూడ్డానికి ఎప్పుడు రమ్మంటారు?''

''సారీ! అమ్మాయి పెళ్లికి ఒప్పుకోవడం లేదండి'' చెప్పాడు రామయ్య.

షాక్ తిన్నాడు రామయ్య మాటలకి. శంకరయ్యకి ఎంతో ఇష్టంగా ఉంది ఈ సంబంధం. రామయ్య ఫ్యామిలీకి వంద కోట్ల ఆస్తి ఉందని చెప్పుకుంటారు. ఆయన కొడుకు విమానప్రమాదంలో మరణించాడు. ఆస్తి మొత్తానికి మనుమరాలే వారసురాలు.

అపర్ణ తనని పెళ్లిచేసుకోవడానికి ఇష్టపడలేదనే సంగతి అర్జున్‌కి జీర్ణం కావడం లేదు. ఇప్పట్లో పెళ్లి చేసుకోనందేమో? కొన్నాళ్లు ఆగమందేమో? లేకపోతే తనంతటి క్రేజీ క్రికెటర్ ఇష్టపడితే వద్దనే అమ్మాయి ఉంటుందా? అదీ ఈ రోజుల్లో? అమ్మాయితో నేను మాట్లాడతాను ఆమె సెల్ నెంబర్ ఇవ్వండని అడిగాడు. రామయ్య సరేనని అపర్ణ సెల్ నెంబర్ ఇచ్చాడు.

అర్జున్ కాల్ చేశాడు.

''హలో! నేను క్రికెటర్ అర్జున్‌ని మాట్లాడుతున్నాను''

''ఐతే ఏంటి?'' అపర్ణ మాటలు విని షాక్ తిన్నాడు. ఆ ఒక్క మాటతోటే ఆమె అంతరంగం ఏమిటో తెలిసిపోయింది అర్జున్‌కి.

ఇక మాట్లాడటానికేముంది?

సెల్ ఆఫ్ చేసి ఆలోచనలో పడిపోయాడు. ఈ లోకంలో ఊర్వశిలాంటి వాళ్లతో పాటు అపర్ణ లాంటి వాళ్లు కూడా ఉంటారని తొలిసారి తెలుసుకున్నాడు అర్జున్.